క్లుప్తంగా

ఉదయభానును కలిసిన ఆర్డీవో సాయిబాబు



వత్సవాయి : నందిగామ ఆర్డీవో పి. సాయిబాబు జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానును గురువారం వత్సవాయిలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఎంతో సుదీర్ఘ అనుభవం ఉన్న సాయిబాబు నందిగామ ఆర్డీవోగా రావడం సంతోషకరమన్నారు. లోటుపాట్లు లేకుండా ప్రజలకు ఉన్నతమైన సేవలను అందించాలని ఆర్డీవోను కోరారు .

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు):సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వై.రత్న ప్రియదర్శిని సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అనిగండ్లపాడు ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, విష జ్వరాలపై అవగాహన కల్పించారు. పిల్లల్లో ఇమ్యూనిటీ పెరిగేందుకు ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ జక్కులూరి రాంబాబు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

పెనుగంచిప్రోలు: మండలంలో రెండోరోజు గురువారంతో సామాజిక పింఛన్ల పంపిణీ 88శాతం పూర్తయినట్లు ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారు జాము నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొంటూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారు.

అధికసంఖ్యలో అయ్యప్ప మాలధారణలు



నందిగామ: పట్టణ శివారు రామలింగేశ్వరనగర్ గురువారం అయ్యప్ప నామస్మరణలతో మార్మోగింది. స్థానిక అయ్యప్ప ఆలయంలో మాలధారణ చేసేందుకు పట్టణంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం అయ్యప్ప శరణుఘోషతో మార్మోగింది. మండల పూజలకు హాజరయ్యే భక్తులు ప్రస్తుతం మాలధారణ చేస్తున్నారని ఆలయ అర్చకులు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.12.32 లక్షలు



నందిగామ: మండలంలోని అంబారుపేటలో గల శ్రీ సత్యమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు గురువారం జరిగింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. మొత్తం 108 రోజులకుగాను హుండీలో కానుకల ద్వారా రూ.12,31,656 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సీతారామయ్య తెలిపారు. హుండీ లెక్కింపును జగ్గయ్యపేట మండలం ముక్త్యాల కోటిలింగాల క్షేత్రం ఈవో శిరీష పర్యవేక్షించగా, ఆలయ కమిటీ చైర్మన్ ఆలోకం శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ



ముక్త్యాల(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల దశ మారిందని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ తిరుపతిరావు కొనియాడారు. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలకు విద్యాశాఖ నుంచి మంజూరైన డైరీలు, నోట్ పుస్తకాలను గురువారం ఆయన పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందని తెలిపారు. సచివాలయ కన్వీనర్ షాఉద్దీన్, ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు, నాయకులు దాది బ్రహ్మం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి



కంచికచర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్



వత్సవాయిలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

కంచికచర్ల : అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ సూచించారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలను కలిపే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.18కోట్లు మంజూరు చేయగా, ఇ నిధులతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సౌజన్యంతో గ్రామాల్లో రోడ్ల అభివృద్ధితోపాటు ప్రజలకు తాగునీరు అందించే విషయంలో శక్తివంచనలేకుండా పనిచేస్తున్నామన్నారు. అందరి భాగస్వామ్యంతో మరింత అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు.

కంచికచర్ల- పెద్దాపురం రోడ్డును రూ.18కోట్లతో అభివృద్ధి చేశామని, పెద్దాపురంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కిలోమీటరు మేర మిగిలిన పనులను కూడా పూర్తిచేసేందుకు ప్రభుత్వం మరో కోటిరూపాయలను కేటాయించిందని, త్వరలోనే పనులు చేపడతామని చెప్పారు. మండల పరిషత్ నిధులు రూ.4కోట్లు, జెడ్పీ నిధులు రూ.45లక్షలతో కంచికచర్ల మండలాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గతప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు నేడు ప్రగతిపథంలో దూసుకుపోతున్నాయన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండుకళ్లుగా పనిచేస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. వసంతకాలనీ, ఇందిరా కాలనీ, మోడల్‌కాలనీ, ప్రణీత కాలనీల్లోని ఇళ్లపై 33కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగల సమస్య 40ఏళ్లుగా ఉండగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.18కోట్లు కేటాయించి ఈ సమస్యను పరిష్కరించిందని గుర్తుచేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద వర్తించే ఆయా జబ్బుల వివరాలతో కూడిన బోర్డులను గ్రామసచివాలయాల్లో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాధవి, ఎంపీడీవో కె.శిల్ప, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి..

వత్సవాయి : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొలుసు రమాదేవి అధ్యక్షతన గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయా శాఖల పనితీరుపై అధికారులను అడిగితెలుసుకున్నారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం, సైడ్ కాలువలు నిర్మాణం, జగనన్న కాలనీ బిల్లులు మంజూరు వంటి సమస్యలను సభ్యులు తెలియజేయగా, ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గతంలో పనులు కావాలంటే మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేదని, నేడు ఆ పరిస్థితులు మారి గ్రామంలోనే అన్ని సేవలు అందుతున్నాయన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మనరాష్ట్రం, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని వివరించారు. ఏపని ఉన్నా సచివాలయం స్థాయిలో పూర్తవుతున్న వైనాన్ని గుర్తుచేశారు. వత్సవాయికి రూ.3కోట్ల జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీరు అందించే పనులు 60 శాతం మేర పూర్తయ్యాయని త్వరలో పనులను పూర్తిచేసి మంచినీరు సరఫరా చేస్తామన్నారు. మక్కపేట, కన్నెవీడు, ఇందుగపల్లి, పోలంపల్లి తదితర గ్రామాలకు కూడా జలజీవన్ ద్వారా మంచినీరు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, సర్పంచ్ భూక్యా సీతమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొలికపోగు వెంకటేశ్వర్లు, తహశీల్దార్ వైకుంఠరావు, ఏవో బి.రాజు, పీఆర్ ఏఈ సుందరరామయ్య, ఎంఈవో ఎల్.నాగరాజు, ఈవోపీఆర్డీ మాధవి, వత్సవాయి పంచాయతీ ఈవో షేక్ ఇమామ్‌సాహెబ్ సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట సామగ్రి అందజేత



హెచ్ఎంలకు సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ కోటేరు శ్రీలక్ష్మి

వీరులపాడు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితోపాటు విద్యార్థులకు అవసరమైన అన్నివసతులు కల్పించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి మండలంలోని ఆయా పాఠశాలలకు మంజూరైన డస్ట్‌బిన్లు, బాత్‌రూమ్ క్లీనర్స్, మధ్యాహ్న భోజన వంట సామగ్రి తదితరాలను స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న వసతులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు అవసరమైన ప్రతి ఒక్క అవసరాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీర్చుతున్నారని గుర్తు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తూ విద్యాభివృద్ధి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎంఈవో కెనడీ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై శిక్షణ

నందిగామ: సమాచార హక్కు చట్టంపై సచివాలయ సిబ్బందికి గురువారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పౌర సమాజ ఐక్య సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కురగంటి హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో సమాచార హక్కు చట్టంపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగిఉండటం ఎంతో ఉపయోగమని వివరించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, కోట రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

రూ.30లక్షలతో మంచినీటి పథకం ప్రారంభం



మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, వైస్‌చైర్మన్లు ఓర్సు లక్ష్మి, పి.కిరణ్

నందిగామ టౌన్: నందిగామ పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణ సమీపంలోని మునేటిలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన మంచినీటిన పథకాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా తగినచర్యలు తీసుకుంటున్నామని, అందులోభాగంగానే ప్రజల అవసరాలకు సరిపడా నీటిని సరఫరా చేసేందుకే మునేటిలో నూతనంగా మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలో వరదలు వచ్చిన సమయంలో వరద ప్రవాహానికి బోర్లు, పైప్‌లైన్, స్కీంకు సంబంధించిన సామాగ్రి కొట్టుకుపోయే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వరదల సమయంలో కొట్టుకుపోకుండా తగిన చర్యలు తీసుకున్నామని వివరించారు. అదనంగా మూడు బోర్లతోపాటు ప్రత్యేక కంటైనర్, ట్రాన్స్‌ఫార్మర్, పంపింగ్ లైన్ సిస్టమ్, ఐదు కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నూతన మంచినీటి పథకం ద్వారా పట్టణంలోని 20 వార్డులకు గాను 12 వార్డుల ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీరు అందుతుందని వివరించారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రజలకు సురక్షితమైన నీటిని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఓర్సు లక్ష్మి, పాకాలపాటి కిరణ్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు గుడివాడ సాంబశివరావు, షేక్ యాకుబ్‌అలీ, విశ్వనాథపల్లి కృపారావు, తానూరి రాము తదితరులు పాల్గొన్నారు.


సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశం

చందర్లపాడు(నందిగామ టౌన్): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని తోటరావులపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తనదృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతే కాకుండా సమస్యలు పరిష్కరించేందుకు ఒక్కో సచివాలయానికి రూ. 20 లక్షల నిధులు సైతం మంజూరు చేస్తున్నారని, ఆ నిధులతో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలలో జరుగుతున్న పనులను అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆయా పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ములకలపల్లి లక్ష్మి, నాయకులు ములకలపల్లి కృష్ణమోహన్, నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అమ్మవారికి ఎమ్మెల్యే సామినేని ప్రత్యేక పూజలు



వేదపండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను దంపతులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారిని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, ఆయన సతీమణి విమలాభాను గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు వారిని అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. వేద పండితులు సామినేని ఉదయభాను దంపతులను ఆశీర్వదించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ రూ.15కోట్లతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆలయం వద్ద, మునేరు అవతల మామిడి తోటల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు సర్పంచ్‌లు వేల్పుల పద్మకుమారి, బి.జ్యోతిబ్రహ్మం, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ పాల్గొన్నారు.

ఇద్దరికి రెండేళ్ల జైలు

వీరులపాడు: భార్యను చిత్రహింసలకు గురిచేసిన కేసులో నేరం రుజువు కావడంతో భర్తతోపాటు అందుకు సహకరించిన మామకు న్యాయమూర్తి రెండేళ్ల జైలు శిక్ష రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు మండలంలోని జయంతి గ్రామానికి చెందిన బండి అనురాధ 2018లో తనభర్త బండి శ్రీనివాస్‌రెడ్డి, మామ అప్పిరెడ్డి కలిసి తనను చిత్ర హింసలకు గురి చేస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి నిందితులిద్దరికీ జైలు శిక్ష, జరిమానా విధించినట్లు వివరించారు.

వరిగడ్డివామి దగ్ధం

వీరులపాడు:ఆకతాయిల కారణంగా వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన మండలంలోని కొణతాలపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని కొణతాలపల్లి గ్రామానికి చెందిన గాదెల లక్ష్మీనారాయణ 30 గేదెలతో డెయిరీ నిర్వహిస్తున్నాడు. పశుపోషణలో భాగంగా భారీస్థాయిలో వరిగడ్డిని సేకరించి వామి ఏర్పాటు చేశారు. కొందరు ఆకతాయిల ధూమపానం కారణంగా ఈ వరిగడ్డి వామి దగ్ధమైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ఘటనలో రూ.1.50లక్షల విలువైన వరిగడ్డి వామి అగ్నికి ఆహుతైనట్లు బాధితుడు వాపోయాడు.

టిడ్కో గృహాలకు మౌలిక వసతులు

ప్రభుత్వ విప్ ఉదయభాను



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో చేపట్టిన టిడ్కో గృహాలకు అన్ని మౌలికవసతులు కల్పించి, త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. టిడ్కో గృహాల వద్ద చేపట్టిన విద్యుద్దీకరణ, ఫ్లోరింగ్(టైల్స్), పెయింటింగ్, ప్లంబింగ్ పనులకు ఉదయభాను గురువారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. టిడ్కో ఇళ్లను పరిశీలించి ఆయా పనులపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ గతంలో టీడీపీ పాలనలో టిడ్కో గృహాలకు భూములు ఇచ్చిన యజమానులకు, నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ వారికి అప్పటి ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో గృహాల పనులు ఆలస్యమయ్యాయన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ బకాయిలను చెల్లించడం జరిగిందని గుర్తుచేశారు. టిడ్కో గృహాలు లబ్ధిదారులకు ఇప్పటివరకు అందించలేకపోవడానికి ప్రధాన కారణం అప్పటి ప్రభుత్వం భూయజమానులకు, నిర్మాణ సంస్థకు డబ్బులు చెల్లించకపోవడమేనన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. నేడు టిడ్కో గృహాల సముదాయం వద్ద రోడ్లు, డ్రెయిన్లు, త్రాగునీరు, విద్యుద్దీకరణ తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పనులు ప్రారంభించామని, త్వరలోనే ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మార్కెట్ యార్డు చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, కౌన్సిలర్లు సాధుపాటి రాజు, తన్నీరు నాగేంద్ర, పార్టీ ఎస్టీ విభాగం అధ్యక్షుడు బద్దూనాయక్, ఏఎంసీ డైరెక్టర్లు పింగళి నరసింహారెడ్డి, గోలి శ్రీనివాస్, నాయకులు జంగాల వాసు, జాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన ఆస్తుల పరిశీలన



ఫిర్యాదులపై విచారణ చేస్తున్న ఏసీ శాంతి

జగ్గయ్యపేట అర్బన్:జగ్గయ్యపేట పట్టణంలోని వేంచేసియున్న పురాతన ఆలయమైన శ్రీవెంకటేశ్వరస్వామివారి దేవస్థానం(పాత వెంకటేశ్వరస్వామి ఆలయం)ను దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతి గురువారం సందర్శించారు. దేవస్థాన ఆస్తులపై అందిన ఫిర్యాదుల మేరకు దేవాలయ ఆస్తుల వివరాలను పరిశీలించారు. అనంతరం దేవాలయానికి విధించిన పన్నుకు సంబంధించి ఎసెస్‌మెంట్లు మారిన విషయమై జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావును కలిసి మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ దీనిపై స్పందించి మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ సర్వేయర్‌ను పంపించి విచారణ చేయించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, ఈవో సి.జయప్రకాష్‌బాబు, విజయవాడ ఈవోలు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినితో హెచ్ఎం, టీచర్లు

కొండపేట(నందిగామ): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని ఆదిపూడి అరుణకుమారి ఎంపికైనట్లు చందర్లపాడు మండలం కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.సీతారాం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో జరిగే అథ్లెటిక్స్‌కు ఎంపికై న విద్యార్థిని అరుణకుమారిని ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సీతారాం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణిస్తున్నారని కొనియాడారు.

60మద్యం సీసాలు స్వాధీనం

నందిగామ: అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఏసీపీ జనార్దన్ నాయుడు హెచ్చరించారు. పట్టణ శివారు అనాసాగరంలో ఇద్దరు మహిళలు ఓ పందుల పాకలో పాతిపెట్టిన 60 మద్యం సీసాలను పోలీసులు గురువారం గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏసీపీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అక్రమ మద్యం నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. అక్రమ మద్యం ఎక్కడ దాచి ఉన్న వెలికి తీస్తామన్నారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ హనీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



వత్సవాయి : ఎటువంటి అనుమతులు లేకుండా లింగాల మునేటి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం రాత్రి పట్టుకున్నారు. మునేటి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బంది దాడిచేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, అనంతరం వత్సవాయి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. అభిమన్యు తెలిపారు.

రుణ సౌకర్యాలపై అవగాహన

జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి, మల్కాపురం గ్రామాలలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కళాజాత ఎంతగానో ఆకట్టుకుంది. ఆయా గ్రామాలలోని ప్రధాన సెంటర్‌లలో సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన, క్రెడిట్, డెబిట్ కార్డుల ఉపయోగాలను కళాజత బృంద సభ్యులు వివరించారు. సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో విగ్రహాల ప్రతిష్ట

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం)లో శుక్రవారం ఉదయం 10.43 గంటలకు నవగ్రహాలు, ప్రసన్నాంజనేయస్వామి, కాలభైరవ, జంట నాగేంద్రుస్వాముల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంతోపాటుగా శిఖర ప్రతిష్టకూడా జరుగనుంది. ఈ సందర్భంగా రెండో రోజు గురువారం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవంలో చివరి రోజు శుక్రవారం ఉదయం 6 గంటలకు పుణ్యాహవచనం తదితర కార్యక్రమాల అనంతరం శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. ప్రతిష్ఠాచార్యులు తుర్లపాటి ఉమామహేశ్వర శర్మ (ఈశాన్య శివాచార్య) నేతృత్వంలో విగ్రహాల ప్రతిష్ట, ఉదయం 11.30 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని గొల్లపూడిలోని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చాట్రాయి: పొలంలో పురుగుమందు పిచికారీ చేస్తూ ఆ ప్రభావానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిత్తపూరు పడమట ఎస్సీ ఏరియాకు చెందిన కడవటి ఇశ్రాయేలు (35) బుధవారం ఓ రైతుకు చెందిన పత్తి తోటలో పురుగుమందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. ఆ రాత్రి ఇశ్రాయేలు ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం తోటలోకి వెళ్లి చూడగా ఇశ్రాయేలు చనిపోయి ఉన్నాడు. రవి పోలీసులకు సమాచారం అందించాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.